క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి


మొక్కలు నాటుతున్న ప్రతాప్ స్వామీజీ

రామచంద్రాపురం: ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీజీ అన్నారు. మంగళవారం మండలంలోని యోగుల పర్వతంలో అమ్మ పేరిట మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తన మాతృమూర్తి విజయమ్మ పేరిట మొక్కలు నాటి, నీరు పోశారు. తల్లిని పూజించినట్లే మొక్కను కూడా పూజించాలని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏకవీర ఫౌండేషన్ సభ్యులు ప్రవీణ్, హరి, గణేష్ పాల్గొన్నారు.

షిరిడీ సాయి హుండీ ఆదాయం రూ.5.63 లక్షలు


శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో హుండీ లెక్కింపు

తిరుపతి కల్చరల్: కొంకావీధిలో వెలిసిన శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం హుండీ ఆదాయం రూ.5,63,780 లభించింది. శ్రీద్వారకామాయి శ్రీషిరిడీ సాయిబాబా సేవా సమాజ్ వారి ఆధ్వర్యంలో మంగళవారం శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలోని హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సేవా సమాజ్ గౌరవాధ్యక్షుడు మబ్బు దేవనారాయణరెడ్డి, కార్పొరేటర్ కుడితి సుబ్రమణ్యం, ప్రతినిధులు బాలకృష్ణ, దుర్గం శ్రీను, మర్దం శివ, పి.విజయలక్ష్మి, సి.రమేష్, కె.హరిబాబు, శ్రీనుయాదవ్, బి.కళావతి, పి.రాణి, వై.లక్ష్మి, కె.ప్రభాకర్, పి.రాజమణమ్మ, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో నిందితుడికి ఏడాది జైలు

తిరుపతి లీగల్: అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి ఎర్రచందనం దుంగలను నరికి తరలించడానికి ప్రయత్నించిన కేసులో బీఎన్ కండ్రిగ మండలం, కరమిట్ట హరిజనవాడకు చెందిన ఎస్.పెద్ద గురవయ్యకు ఏడాది జైలు శిక్ష, ఐదువేల రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. అంగూర్ బీట్, పంగి అటవీ ప్రాంతంలోకి నిందితుడు పెద్ద గురవయ్య మరొకరు అక్రమంగా ప్రవేశించి ఎర్రచందనం దుంగలను నరికి అక్కడ పొదల్లో దాచిపెట్టేవారు. తర్వాత వాటిని అక్రమంగా తరలించేవారు. ఈ విషయాన్ని తెలుసుకున్న శ్రీకాళహస్తి ఫారెస్ట్ రేంజ్ అధికారులు 2016 మార్చి 12వ తేదీ దాడులు నిర్వహించి పెద్ద గురవయ్యను అదుపులోకి తీసుకున్నారు. రమణయ్య అనే వ్యక్తి పరారయ్యాడు. అతని నుంచి 19 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఫారెస్ట్ అధికారులు పెద్ద గురవయ్యపై కేసు నమోదు చేసి అతన్ని కోర్టులో హాజరు పరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో పెద్ద గురవయ్యకు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

'అమ్మ పేరుతో చెట్టు' కార్యక్రమం


మొక్కలు నాటుతున్న ఎస్వీ వ్యవసాయ కళాశాల డీన్, అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మ పేరుతో చెట్టు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ ముఖ్యఅతిథిగా విచ్చేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి విద్యార్థి అమ్మ పేరుతో ఓ చెట్టును నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పి.శాంతి, సి.గణేష్‌కుమార్, డాక్టర్ బి.రమణమూర్తి, కార్తిక్, నాగిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిత్యావసర విక్రయ కేంద్రాలు

తిరుపతి అర్బన్: తిరుపతి, గూడూరు రైతు బజార్లలో ప్రత్యేక నిత్యావసర సరుకుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు సివిల్ సప్లయిస్ జిల్లా అధికారి రాజారఘువీర్ తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి ఇవి అమల్లో ఉంటాయన్నారు. కిలో బియ్యం రూ.45, స్టీమ్డ్ బియ్యం రూ.48, కంది పప్పు కిలో రూ.166కు అందిస్తామని తెలిపారు.

కమిషనర్ బంగ్లా అందాలకు రూ.2 కోట్లు!

- ఇప్పటికే కోటిన్నర మంజూరు చేసిన మున్సిపల్ కౌన్సిల్
- సాధారణ నిధుల నుంచి ఇంటి అద్దె పొందేందుకు రంగం సిద్ధం
- జీఓలకు వక్రభాష్యం చెబుతూ నెలకు రూ.40 వేలు చొప్పున అద్దె చెల్లింపు
- ఇప్పటికే అడ్వాన్స్‌గా లక్షన్నర చెల్లింపు
- 34 అంశాలతో అజెండా.. అభివృద్ధి ప్రతిపాదనలు శూన్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: కోటిన్నరతో కమిషనర్‌గారి కొత్త బంగ్లా నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. అంతవరకు బాగానే ఉన్నా ఆ బంగ్లా బ్యూటిఫికేషన్‌కు ఏకంగా రూ.2 కోట్లు అనుమతి కోసం కౌన్సిల్ అనుమతి కోసం ప్రతిపాదనలు చేయడం విమర్శలకు తావిస్తోంది. కోటిన్నర రూపాయలు ఖర్చు పెట్టి కట్టిన ఇంటికి బయట, లోపల అందాలకు రెండు కోట్లు కావాలని అడిగిన వింత పరిస్థితి చూసి అంతా అవాక్కవుతున్నారు. ఇంటి నిర్మాణం కంటే బ్యూటిఫికేషన్‌తో కూడిన వసతుల కోసం అంతకు మించి ఖర్చు చేయాలనుకోవడం, ఈ ప్రతిపాదనను కౌన్సిల్ అజెండాలో చేర్చడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. 34 అంశాలతో కౌన్సిల్ సమావేశాన్ని నగర మేయర్ డాక్టర్ ఆర్.శిరీష అధ్యక్షతన నిర్వహించనున్నారు. తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అధికారిక నివాసాన్ని జిల్లా కలెక్టర్ బంగ్లాకు మించిన స్థాయిలో నిర్మించడానికి అధికారులు ఉవ్విళ్లూరుతున్నారు. ఎస్వీ యూనివర్సిటీ ప్రాంగణంలో మున్సిపల్ కమిషనర్ అధికార నివాస భవనం నిర్మాణం కోసం కౌన్సిల్ ఇప్పటికే కోటిన్నర రూపాయలు మంజూరు చేసింది. ఇంటీరియర్ డెకరేషన్, వుడ్ వర్క్ ఇతర అలంకరణ పనుల కోసం మరో రూ.2 కోట్లు కావాలని కమిషనర్ చేసిన ప్రతిపాదనకు అజెండాలో చేర్చారు. వారి అభిరుచులకు తగ్గట్టు అధికారులు చకచకా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బుధవారం నిర్వహించబోతున్న కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేయించే ఏర్పాట్లు చేశారు. తిరుపతి నగరంలో జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ అధికార నివాసాలు ఉన్నాయి. వీటి మరమ్మతులు, అంతర్గత అలంకరణల కోసం కోట్ల రూపాయలతో ఏనాడూ ఖర్చు చేయలేదు. అవి సాధారణ ఐఏఎస్ అధికారుల నివాసాలు గానే ఉన్నాయి. కానీ మున్సిపల్ కమిషనర్ ఇంటి నిర్మాణానికి రూ.1.5 కోట్లు మంజూరు చేస్తే అది చాలదని మరో రూ.2 కోట్లు ఖర్చు పెట్టాలనుకోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

జీఓలకు వక్రభాష్యం

మున్సిపల్ కమిషనర్ తన నివాస గృహం అద్దె కోసం ప్రతి నెలా రూ.40 వేలు మున్సిపల్ జనరల్ ఫండ్ నుండి ఖర్చు చేస్తున్నారు. అలాగే ఇంటి అద్దెతో పాటు లక్షన్నర రూపాయలు అడ్వాన్స్‌గా కూడా చెల్లించేశారు. ఈ అంశం కూడా బుధవారం నిర్వహించే కౌన్సిల్ సమావేశం ముందుకు రాబోతోంది. కమిషనర్ తన జీతం అలవెన్స్ నుండే ఇంటి అద్దె చెల్లించాలి. ఇది ఎవరికైనా వర్తించే నిబంధన. అయితే కార్పొరేషన్ సాధారణ నిధి నుండి అద్దె చెల్లిస్తే అధికారి అలవెన్స్ ఏమైనట్టు అనేది డాలర్ల ప్రశ్న. ఇలా సాధారణ నిధులను అద్దెకు వాడుకోవడం చట్ట విరుద్ధమని తెలిసినా ఇక్కడ పట్టించుకునేవారు కరువయ్యారు. ఇది ప్రభుత్వ జీఓలకు విరుద్ధమని నిపుణులు పేర్కొంటున్నారు. జీఓ ప్రకారం కమిషనర్ తన ఇంటి అద్దెను ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగం(జీఏడీ) ద్వారా చెల్లించాలి. కమిషనర్ జీతంలో ఇంటి అద్దె అలవెన్స్ మినహాయిస్తారు. గతంలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన అనుపమ అంజలి ఇదే పద్ధతిలో ఇంటి అద్దె చెల్లించారు. ఆమె కార్పొరేషన్ నిధుల నుండి ఇంటి అద్దె చెల్లించని విషయాన్ని అధికారులు విస్మరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఉపయోగపడాల్సిన కార్పొరేషన్ నిధులకు గండి కొట్టే ఈ రెండు ప్రతిపాదనలు చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

అభివృద్ధికి ఏవీ నిధులు

కౌన్సిల్ ఏర్పడి మూడున్నరేళ్లు అవుతోంది. ప్రతి కౌన్సిల్‌లోనూ అత్యధిక అంశాలు తిరుపతి నగర భవిష్యత్‌ను నిర్ణయించే అభివృద్ధిపైనే ఉండేది. అయితే ప్రస్తుతం అభివృద్ధికి సంబంధించి ఆశించిన స్థాయిలో అజెండాలో ప్రతిపాదనలు లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

అన్నప్రసాదం తయారీ ఆధునికీకరణకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుమల: శ్రీవారి భక్తులకు మరింత రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడానికి అన్నప్రసాద తయారీ విధానాన్ని ఆధునికీకరించాలని దక్షిణ భారత దేశంలోని ప్రఖ్యాత చెఫ్‌లు, పాకశాస్త్ర నిపుణులు టీటీడీకి సూచించారు. శాఖాపరమైన సమీక్షా సమావేశంలో భాగంగా తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, దక్షిణ భారతదేశ అసోసియేషన్ చెఫ్‌లతో కలిసి అన్నప్రసాదం, వంటశాలల ఆధునికీకరణ తదితర అంశాలపై టీటీడీ ఈఓ జె.శ్యామలరావు సుదీర్ఘంగా సమీక్షించారు. తిరుమలలో శ్రీవారి భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదం రుచి, నాణ్యతను మెరుగు పరిచేందుకు ఏర్పాటు చేసిన ప్రముఖ వంటల తయారీ నిపుణుల కమిటీ నుండి పలు సూచనలు, సలహాలు ఆహ్వానించారు. అంతకుముందు ఈ కమిటీ మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రాన్ని సందర్శించి, అన్నప్రసాదాలు వడ్డించడం, నిల్వ చేయడం, శుభ్రపరచడం తదితర కార్యకలాపాలను పరిశీలించారు. టీటీడీ ప్రతిరోజూ లక్షలాదిమంది భక్తులకు అందిస్తున్న అన్న ప్రసాదాలను వారు అభినందించారు. అయితే రోజురోజుకు పెరుగుతున్న అసంఖ్యాక భక్తుల అవసరాలకు అనుగుణంగా మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలోని వంటశాలలను ఆధునికీకరించాలని తెలిపారు. ఇందులో భాగంగా అన్నప్రసాద భవనంలో సేవలందిస్తున్న సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ద్వారా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం, ఇన్ హౌస్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసి, తనిఖీ చేయడం, ఆహార పదార్థాల పరిశుభ్రత తదితర అనేక సలహాలు తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లపై పక్కా ప్రణాళికను రూపొందించి, మరోసారి అన్నప్రసాద కార్యకలాపాలపై ఆహార నిపుణులతో త్వరలో మరోసారి సమావేశం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. ఈ సమావేశంలో సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్ రెడ్డి, డిప్యూటీ ఈఓ రాజేంద్ర, స్పెషల్ క్యాటరింగ్ అధికారి శాస్త్రి, జీఆర్‌టీ గ్రూప్ ఆఫ్ హోటల్స్ సీఈఓ విజయ్ విక్రమ్ కోటా, ప్రఖ్యాత చెఫ్, ప్రెసిడెంట్-సౌత్ ఇండియా చెఫ్స్ అసోసియేషన్ డాక్టర్ దామోదరన్, చెఫ్ తిరులోగచందర్, ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్-తిరుపతి హెడ్ చెఫ్ సీతారామ్ ప్రసాద్, కిచెన్ కన్సల్టెంట్స్, డిజైనర్ రితేష్ చౌదరి, దీపక్, నితీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీవీఎస్ఓ నరసింహ కిషోర్, ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఇతర అధికారులతో రోజువారీ వివిధ దర్శనాలపై ఈఓ సమీక్షించారు. తిరుమల పరిశుభ్రతపై జేఈఓ(విద్య, ఆరోగ్యం) గౌతమితో ఈఓ వర్చువల్ సమావేశం నిర్వహించారు.

పరిశుభ్రతతోనే అంటు వ్యాధులకు అడ్డుకట్ట


నగరంలో పర్యటిస్తున్న కమిషనర్ అదితిసింగ్

తిరుపతి తుడా: నగరంలోని ప్రతి ఒక్కరూ చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే అంటు వ్యాధులు దరిచేరవని నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని తిమ్మినాయుడుపాలెం, హరిజనవాడ, రెడ్డిగుంట, ఉప్పరపాలెం తదితర ప్రాంతాల్లో హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం తెల్లవారుజాము నుండి కమిషనర్ పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరాపై ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డెంగీ, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా నగరపాలక సంస్థ తరఫున ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా ఇళ్ల పరిసరాల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. వారంలో ఒక రోజు ఇంట్లోని వాటర్ ట్యాంకులు శుభ్రం చేసి డ్రై డే పాటించాలని తెలిపారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డీఈఈ విజయకుమార్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్స్ చెంచయ్య, సుమతి తదితరులు ఉన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు


కేంద్ర సమాచార శాఖ చీఫ్ కమిషనర్ హీరాలాల్ సమారియా, తిరుపతి ఎంపీ గురుమూర్తి, సంగీత దర్శకుడు విద్యాసాగర్, సినీ నటుడు గణేష్ వెంకట రామన్

తిరుమల: శ్రీవారిని మంగళవారం కేంద్ర సమాచార శాఖ చీఫ్ కమిషనర్ హీరాలాల్ సమారియ, తిరుపతి ఎంపీ గురుమూర్తి, సంగీత దర్శకుడు విద్యాసాగర్, సినీ నటుడు గణేష్ వెంకట రామన్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూప్రసాదాలతో సత్కరించారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం


ప్రమాణస్వీకారం చేస్తున్న రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: రోటరీ క్లబ్ తిరుపతి 66వ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ తిరుపతి చారిటబుల్ ట్రస్ట్ భవన్ స్థలంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగళూరు రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ బీఆర్ శ్రీధర్ హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గత ఏడాది రోటరీ సేవా కార్యక్రమాలను అందరికీ వివరించారు. తర్వాత రోటరీ ట్రస్ట్‌కు విలువైన స్థలాన్ని విరాళంగా ఇచ్చిన రోటరీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత ట్రస్ట్ అధ్యక్షుడు సుదర్శనరాజు, ప్రముఖ న్యాయవాది, రోటరీ సభ్యుడు మట్టా పురుషోత్తంరెడ్డి, రాధికా రాణిలను ఘనంగా సత్కరించారు. 2024-25 ఏడాదికి అధ్యక్షుడిగా ఎన్నికైన సోము రవికుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. రాబోయే ఏడాదిలో తాను చేయదలచిన సేవా కార్యక్రమాలను నూతన అధ్యక్షుడు తెలియజేశారు. అనంతరం రోటరీ క్లబ్ కార్యదర్శిగా రాజేష్‌కుమార్, కోశాధికారిగా బి.మునిస్వామి శెట్టి బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షులుగా ఎంసీ.రెడ్డెప్ప, సయ్యద్ ఖలీల్, కె.కిషోర్‌కుమార్, లక్ష్మీపతి, ఇతర డైరెక్టర్లు బాధ్యతలు చేపట్టారు. జోన్ గవర్నర్ హేమచందర్, అసిస్టెంట్ గవర్నర్ సి.రెడ్డి కరుణానిధి, టెంకాలయ దామోదరం, కె.వెంకటాచలపతి, రాజేంద్రశెట్టి, బాలగురప్ప, రామ్మోహన్‌రెడ్డి, దామోదర్ గుప్తా పాల్గొన్నారు.

ఫోన్ చేసినా సమస్యలకు పరిష్కారం

తిరుపతి (అలిపిరి): ప్రజలు ఎలాంటి సమస్యపై అయినా ఫోన్ చేస్తే చాలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం భవానీనగర్, చెన్నారెడ్డి కాలనీ, తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో కృతజ్ఞత సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కిరణ్‌రాయల్, శ్రీధర్‌రాజు, రాజారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న జాతీయ మహిళా పార్టీ కన్వీనర్ టి.రాజేశ్వరి ప్రభాకర్

తిరుపతి కల్చరల్: మహిళలకు భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జాతీయ మహిళా పార్టీ కన్వీనర్ టి.రాజేశ్వరి ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడారు. రెండేళ్ల నుంచి 80 ఏళ్ల మహిళల వరకు అభద్రతా భావంతో బతుకులు సాగించే పరిస్థితి ఏర్పడిందన్నారు. చిన్నారులపై, మహిళలపై అత్యాచారాలు జరుగుతుండడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం మహిళ భద్రత కోసం పటిష్ట చర్యలు చేపట్టాలని, అత్యాచారాల నివారణపై ప్రత్యేక దృష్టించి సారించాలని కోరారు. అలాగే బ్యాంకుల్లో దాచుకొని ఖాతాదారుల సొమ్ములకు భద్రత లేకుండా పోయిందన్నారు. ఇలాంటి వాటిపై ప్రభుత్వం దృష్టించి సారించి ఖాతాదారులకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జాతీయ మహిళా పార్టీ ప్రతినిధులు విజయలక్ష్మి, పూర్ణిమ, దేవి, శ్రీవాణి, అనసూయ, వరలక్ష్మి పాల్గొన్నారు.

మాంసాహార ఉత్పత్తుల తయారీపై శిక్షణ


శిక్షణ ఇస్తున్న వెటర్నరీ వర్సిటీ అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పశు ఉత్పత్తుల సాంకేతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామీణ మహిళలకు మాంసాహార ఉత్పత్తుల తయారీపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెటర్నరీ వర్సిటీ డీన్ వీరబ్రహ్మయ్య, పశువైద్య కళాశాల అసోషియేట్ డీన్ జగపతిరామయ్య ముఖ్యఅతిథులుగా విచ్చేసి, విలువ చేకూరిత మాంసాహార ఉత్పత్తుల తయారీలో నైపుణ్యాన్ని పెంపొందించుకునే సూచనలు వివరించారు. అనంతరం చికెన్ సమోసాలు, చికెన్ ఇడ్లీ, చికెన్ నగ్గెట్స్, సూప్‌లు, చికెన్ ఊరగాయలు తదితర ఆహార పదార్థాల తయారీపై గ్రామీణ మహిళలకు మెళకువలను నేర్పించారు. శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, సుధీర్, నవీన్, పెద్ద సంఖ్యలో మెప్మా మహిళలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై చర్యలు చేపట్టాలి

తిరుపతి ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు తక్షణమే పరిష్కరించాల్సిన సమస్యలపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ, ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తోందని, ముఖ్యంగా జీఓ 117, 3, 4, 5వ తరగతుల విలీనం, ఇతర సమస్యలతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రతి హైస్కూల్‌కు హెడ్‌మాస్టర్, పీడీ పోస్టులను కేటాయించాలని కోరారు. హైస్కూల్ ప్లస్‌లో రెగ్యులర్ ప్రాతిపదికన లెక్చరర్లను, ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని తెలిపారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, డీఈఓ పూల్‌లో ఉన్న పండిట్ల అప్‌గ్రేడేషన్‌కు చర్యలు తీసుకోవాలని, అన్ని పాఠశాలల్లో తెలుగు మీడియంను కొనసాగించాలని సూచించారు. విద్యాశాఖ మంత్రి అన్ని ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు తీసుకుని విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

క్యాన్సర్ పరీక్షలకు విశేష స్పందన


ఐతేపల్లిలో పింక్ బస్సు సిబ్బంది

చంద్రగిరి: క్యాన్సర్‌కు సంబంధించిన పలు రకాల ఉచిత స్క్రీనింగ్ పరీక్షలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించినట్లు కొటాల, చంద్రగిరి పీహెచ్‌సీ మెడికల్ అధికారులు డాక్టర్ ప్రియాంక, కుసుమకుమారి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఐతేపల్లి, శానంబట్ల గ్రామాల పరిధిలో టీటీడీ స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సులో క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్విమ్స్ పింక్ బస్సు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో బ్రెస్ట్, ఓరల్, సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలతో పాటు మరికొన్ని పరీక్షలను నిర్వహించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన లేకపోవడంతో తరచూ రోగాల బారిన పడుతున్నారన్నారు. 45 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళా తరచూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను చేయించుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, 104, స్విమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురికి ఐదేళ్ల జైలు

చిత్తూరు అర్బన్: వ్యక్తిపై దాడి చేసి డబ్బులు లాక్కున్న ఘటనలో ముగ్గురు నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ చిత్తూరులోని న్యాయస్థానం మంగళవారం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ కథనం.. కేరళలోని ఎర్నాకులంకు చెందిన ఆసిన్ అనే వ్యక్తి తిరుపతిలో మొబైల్ షాప్ పరికరాలు విక్రయిస్తూ జీవించేవాడు. గత ఏడాది అక్టోబర్ 11న అలిపిరి బస్టాండ్ వద్ద ఉన్న ఆసిన్‌పై ముగ్గురు ఆగంతకులు దాడి చేసి, అతని వద్ద ఉన్న రూ.13 వేల నగదు, రూ. 4 వేల విలువచేసే మొబైల్ పరికరాలను లాక్కెళ్లిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు . దాడికి పాల్పడింది తమిళనాడుకు చెందిన రాజా, తిరుపతి, షాజహాన్‌గా గుర్తించారు. ముగ్గురినీ అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి వెన్నెల తీర్పునిచ్చారు.

ఓపీ... ప్రజలకు బీపీ



పేదల ఆసుపత్రి రుయాకు నిత్యం వందలాది మంది చికిత్స కోసం వస్తుంటారు. తిరుపతి జిల్లా నలుమూలల నుంచి వచ్చేవారు అత్యవసర విభాగం ఓపీ తీసుకోవాలంటే సవాలక్ష ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం నిర్ణయంతో ప్రత్యేకంగా ఎమర్జెన్సీ ఓపీ కౌంటర్‌ను ప్రారంభించారు. అయినా కూడా ప్రజలకు కష్టాలు తీరడం లేదు. దీనికి అదనంగా ఆసుపత్రి సిబ్బందిని, కౌంటర్‌ను ఏర్పాటు చేసి సులభతరంగా ఓపీ పొందేలా చర్యలు తీసుకోవాలని సాధారణ ప్రజలు కోరుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



